క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ –711 జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొరవెల్లి పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నర్సింహులు, రాములు, గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షులు కాశీ విశ్వనాథ్, శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీలుగా భాగ్యలక్ష్మి, గీత, తులసీ, సుధారాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రచార కార్యదర్శి ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. వారిని పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందువాసిలో పశువైద్య శిబిరం



గట్టు: మండలంలోని ఇందువాసిలో గురువారం పశువైద్యాధికారి శంకరయ్య ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 12 ఆవులు, 20 గేదెలకు ఉచితంగా చికిత్సలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి తెలిపారు. శిబిరంలో గోజాతి పశువులు, కోడెలు, ఎద్దులు, ఆవులు, లేగదూడలు మొత్తం 90 పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవమ్మ, పశువైద్యాధికారి కనకయ్య, వీఏ సూర్యరెడ్డి, జీఎం సూపర్‌వైజర్లు శివశంకర్‌నాయుడు, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యం వల్లనే పెండింగ్‌లో ప్రాజెక్టులు



గద్వాల అర్బన్: పాలకుల వైఫల్యంతోనే ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని వివిధ సంఘాల నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పెండింగ్ ఉన్నాయని, ఓట్ల కోసం వచ్చే నాకులను పెండింగ్ ప్రాజెక్టులపై నిలదీయాలన్నారు. ఈ మేరకు అక్టోబర్ 2న నడిగడ్డతో పాటు ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు మహబూబ్‌నగర్‌లో 30గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు, టీపీఎఫ్ నాయకులు ప్రభాకర్, రైతాంగ సమితి రాష్ట్ర నాయకులు గోపాల్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దస్తగిరి, దళిత ఐక్యవేదిక నాయకులు మోహన్, గోపాల్ రావు, సాదతుల్లా, ఖాసీం ఉన్నారు.

సామాజిక విప్లవ కవి గుర్రం జాషువా



అలంపూర్: సాజిక విప్లవ కవి గుర్రం జాషువా అని సమసమాజ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. అలంపూర్ పట్టణంలో గుర్రం జాషువా జయంతిని సమసమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమా లు వేసి నివాళ్లు అర్పించారు. సామాజిక విప్లవ కవి గుర్రజాషువా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వినుకొండలో 1895 సెప్టెంబర్ 28న జన్మించినట్లు తెలిపా రు. కార్యక్రమంలో సమసమాజ సేవా ట్రస్టు సభ్యులు ఆశన్న, వెంకటస్వామి, రాజు, బాబు, బలగం నాగరాజు, మద్దిలేటి, సిద్దయ్య ఉన్నారు.

రాజోళి: విశ్వకవిగా పేరు పొందిన గుర్రం జాషువా సేవలు మరువలేనివని కేవీపీఎస్ నాయకులు విజయ్, ఉప సర్పంచ్ గోపాల్ అన్నారు. మండల కేంద్రం రాజోళిలో ఆయన జయంతి సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, లక్ష్మన్న పాల్గొన్నారు.

విష జ్వరాలతో అప్రమత్తం



అమరచింత: పట్టణంలోని నాల్గో, ఐదో వార్డుల్లో ప్రజలు విష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని, జ్వరాలు ప్రబలకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ అన్నారు. ఉమ్మడి మండలాల వైద్యాధికారి డాక్టర్ శరత్ ఆదేశాలతో పట్టణంలోని ఆయా వార్డుల్లో గురువారం ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిని కాకుండా రోజు వారీగా కుళాయిల ద్వారా పట్టుకుని వినియోగించాలని సూచించారు. పట్టణంలో ఇప్పటికే ఇద్దరు డెంగ్యూ జ్వర బాధితులు ఉన్నారని, వారు కోలుకుంటున్నారని తెలిపారు. బ్రీడింగ్ చెక్కర్ విజయ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రయాణ కష్టాలు తీరేనా

- ఐదేళ్లు గడిచినా సాగని పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



ఆర్ గార్లపాడు సమీపంలో పెద్దవాగుపై నిర్మిస్తున్న నూతన బిడ్జి కోసం తీసిన ఫిల్లర్ గుంతలు

ఎర్రవల్లిచౌరస్తా: వాగులు, వంకలు ఉప్పొంగడం వల్ల వర్షాకాలంలో ప్రయాణ కష్టాలు ప్రజలు ఎదుర్కొంటున్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం కోసం చేపట్టిన బిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించి ఐదేండ్లయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల అలసత్వం వల్ల బిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి ఐదేండ్లు గడిచినా ముందుకు సాగడం లేదు. ఇటిక్యాల మండలంలోని ఆర్ గార్లపాడు సమీపంలో పెద్దవాగుపై నిర్మిస్తున్న బిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.52 కోట్లు కేటాయించగా కాంట్రాక్టర్ 2018 ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పలు కారణాల వల్ల బిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వర్షాకాలంలో తప్పని తిప్పలు..

బిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనివల్ల పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈరోడ్డుపై వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. బిడ్జి నిర్మాణం కోసం రోడ్డును పూర్తిగా తొలగించి వాగును దాటేందుకు పక్కన తాత్కాలిక మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. తాత్కాలిక రోడ్డును సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో వాగు వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

రాకపోకలకు అంతరాయం..

వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇటిక్యాల మండలంలోని షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం గ్రామాలతో పాటు మానోపాడు, ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా సార్లు జిల్లా అధికారులు, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహంలు ప్రవహిస్తున్న వాగును పరిశీలించి బిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో మాట్లాడి హామీ ఇచ్చారు. అయినా ఎలాంటి పురోగతి లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నారు..



బిడ్జి నిర్మాణం చేపట్టి ఐదెండ్లు గడిచినా పనులు ముందుకు సాగడంలేదు. దీనివల్ల వాగు దగ్గర ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కూడా గుంతలుపడి సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు త్వరగా చర్యలు తీసుకొని బిడ్జి నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రయాణికులను ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలి.

– ఇసాక్, ఆర్ గార్లపాడు

బిడ్జిని త్వరగా నిర్మించండి..



వర్షాకాలంలో ఇక్కడ పెద్దవాగు పొంగి పొర్లుతుంది. దీనివల్ల చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. పలుపార్లు అత్యవసర పరిస్థితుల్లో వాగును దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వాగును దాటలేక పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి పెట్టి బిడ్జిని త్వరగా నిర్మించాలి.

– రవికుమార్, కారుపాకుల

పనులను పూర్తి చేయిస్తాం

బిడ్జి నిర్మాణం ప్రారంభించి ఫిల్లర్ గుంతలను తీశాక వర్షాలకు వరదనీరు ఫిల్లర్ గుంతల్లోకి చేరడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం బిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించేందుకు గత వారంలో కాంట్రాక్టర్‌తో కలిసి వాగు పరిస్థితిని పరిశీలించాం. త్వరలోనే పనులను ప్రారంభించి ఆరునెలల్లో బిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషిచేస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈఈ

ఘనంగా అనంతపద్మనాభస్వామి వ్రతం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అనంతపద్మనాభ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, నరేందర్, వెంకటన్న, నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, అజయ్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి



మల్దకల్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని జిల్లా నాయకులు నల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు సద్దుగౌడ పాటిల్, కావేరి, షేక్‌జమాల్, నరేందర్, శ్రీకాంత్, రాజేంద్ర, వెంకటేష్, రఘు, రవినాయుడు, హాజీ, తిమ్మారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

అయిజ: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మైనర్ బాబు, రాజు, పాండురంగ, దొడ్డెప్ప, శంకర్‌గౌడ్, రవీందర్, లాల్ గౌడ్, మహే ష్, రాముడు, వెంకటేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



అయిజలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు



అలంపూర్‌లో చెవిలో పువ్వులతో ఆశా కార్యకర్తల నిరసన..

అయిజ: ఆశా కార్యకర్తల డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని ఎంపీడీఓ కార్యాలయం ముందు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆశా కార్యకర్తల డిమాండ్లను వెంటనే నెరవేర్చకుంటే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అలంపూర్: చెవిలో పువ్వులతో ఆశా కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం ఆశ వర్కర్ల మండల కార్యదర్శి నాగేశ్వరమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు శివలింగమ్మ, చంద్రకళ, మమత, శ్రీదేవి, శ్యామల, రమణమ్మ, తులశ మ్మ, మంజులఉన్నారు.

గద్వాల అర్బన్: ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మోహన్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న అన్నారు. సీఐటీయూ జిల్లా ఉ పాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, మున్సిపల్ యూనియన్ నాయకులు నర్సింహ, రంగన్న, ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి సునీత ఉన్నారు.

మల్దకల్: ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా కార్యకర్తల సంఘం సభ్యులు కాంతమ్మ, సుజాతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ, కేశమ్మ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె మద్దతుగా సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నరసింహ, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, కృష్ణ, సైదు బాషా పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో ఆశా వర్కర్లు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ హాజరై మాట్లాడారు. ఆశా వర్కర్లు చెన్నమ్మ, నీలమ్మ, వెంకటేశ్వరమ్మ, సంతోషిమాత, సుజాత, కుమారి, లక్ష్మి, లలిత ఉన్నారు.

ధరూరు: ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వీవీ నర్సింహ అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



శాంతినగర్: గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేయాలని ఎంఐఎం పార్టీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కలీముల్లా కార్యకర్తలకు సూచించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ఎంఐఎం పార్టీ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమావేశంలో ఎంఐఎం పార్టీ నియోజకవర్గ సెక్రటరి యూసుఫ్, వడ్డేపల్లి అధ్యక్షులు కవిత, ఇటిక్యాల మండల అధ్యక్షుడు నజీర్, మానవపాడు జాకీర్‌హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగం చిరస్మరణీయం



జూలెకల్‌లో భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో యువకులు



భగత్‌సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: భగత్‌సింగ్ త్యాగం చిరస్మరణీయమని ఏఐఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమేష్, వీరేశేఖర్, తిరుమలేష్ ఉన్నారు.

శాంతినగర్: భగత్‌సింగ్ జయంతి వేడుకలను వడ్డేపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. జూలెకల్‌లో యూత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జూలెకల్ యూత్ సభ్యులు శేఖర్, బీచుపల్లి, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలపై పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, కరెప్ప, రవి, ఆశన్న, ఉపేందర్, రాజు ఉన్నారు.

అయిజ: పట్టణంలోని సంతబజార్ కాలనీలో బీజేపీ నాయకులు భగత్‌సింగ్, జాషువా జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, ఉపాధ్యక్షుడు జానకి రాముడు, తిరుమలేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు వెంకటేష్, వీరయ్య, బూత్ అధ్యక్షులు రఘు, ఈరన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



అయిజ: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని పట్టణంలో గురువారం మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రోడ్లపై పెద్ద సంఖ్యలో శాంతిర్యాలీ చేశారు. మజీదులు, దర్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అలంపూర్: నియోజకవర్గంలో మిలాద్-ఉన్-నబీ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ ఘనంగా జరుపుకున్నారు. సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదానం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు.

రైతులకు ఒకే సారి రూ.2లక్షల రుణమాఫీ



తుమ్మలచెరువులో మాట్లాడుతున్న సరిత

గట్టు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఒకే సారి రూ.2లక్షల రుణ మాఫీ చేయనున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ సరిత తెలిపారు. తిరగబడుదాం–తరిమి కొడదాం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి తుమ్మలచెరువులో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గద్వాలలో మార్పుకు శ్రీకారం చుడదామని, కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల లక్ష్మీదేవి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వరలక్ష్మి, వెంకటస్వామిగౌడు, కృష్ణమూర్తి, సత్యనారాయణ, లత్తీపురం వెంకట్రామిరెడ్డి, గౌస్, గట్టు సర్పంచు ధనలక్ష్మి పాల్గొన్నారు.

బై బై గణేశా..

- బీచుపల్లిలో గణనాథుల నిమజ్జనం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన గణనాథులు



ట్రాక్టర్‌లో బీచుపల్లికి చేరుకుంటున్న గణనాథుడు



కృష్ణమ్మ ఒడిలోకి చేరుతున్న గణపయ్య

ఎరవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి కృష్ణానదిలో గురువారం గణనాథుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గణనాథులను తీసుకొచ్చి నిమజ్జనం చేస్తున్నారు. వినాయకుడి లడ్డూకు మండపాల దగ్గర హోరాహోరీగా వేలం పాటలను నిర్వహించారు. సాయంత్రం నృత్యాలు చేసుకుంటూ శోభాయాత్రగా బీచుపల్లి కృష్ణానదికి తరలించారు. అనంతరం క్రేన్ సహాయంతో గణనాథులను కృష్ణమ్మ ఒడిలోకి నిమజ్జనం చేశారు. కృష్ణానది పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇటిక్యాల పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు బందోబస్తు నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో గురువారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని నరసింహా కాలనీలో ప్రతిష్ఠించిన గణేష్ లడ్డూను కర్నూలుకు చెందిన శాంతి సీడ్స్ యజమాని మోహన్ రూ. 94,116లకు దక్కించుకున్నారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు.

గణపతి మండపాలలో అన్నదానం

గద్వాల: జిల్లా కేంద్రంలో కొలువుదీరిన గణేష్ మండపాలలో నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం టీటీయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు చేశారు. 36వ వార్డులో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో వార్డు కౌన్సిలర్లు వేరువేరుగా గణనాథునికి పూజలు నిర్వహించారు. కొన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారు.



సంకాపురంలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



రైతువేదిక భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దూసుకపోతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పనులను ప్రారంభించారు. అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మండలంలోని ఎక్లాస్‌పురంలో రూ.41లక్షలతో చేపట్టిన రైతు వేదికను, రూ.24 లక్షలతో ఆధునీకరించిన మన ఊరు – మన బడి పాఠశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తొత్తినోనిదొడ్డిలో రూ.16 లక్షలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. భూంపురంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యవేక్షణలేని నిఘానేత్రం

- పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మానవపాడు జాతీయ రహదారి-44పై ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

మానవపాడు: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్‌లతో సమానం, నిరంతరం నిఘా నీడలో పర్యవేక్షణ చేస్తుంది. ఎన్నో అంతుచిక్కని కేసులను సీసీ కెమెరా పుటేజీల ద్వారా పరిష్కరించిన సందర్భాలున్నాయి. నేరం తమది కాదంటూ తప్పించుకునే దోషులను సైతం పుటేజీలతో పట్టిస్తోంది. ఎన్నో ఘటనలకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. తప్పులు, చోరీలు, నేరాలు జరుగకుండా నిరంతరం కాపలా కాసేవి సీసీ కెమెరాలు మాత్రమే. దాతల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి పనిచేయక, పలు ఘటనల్లో వాస్తవాలు తెలియడం లేదని మండల ప్రజల వాపోతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు..

మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద మొత్తం 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, రైల్వేగేట్, జాతీయ రహదారిపై, కొర్విపాడు స్టేజీ సమీపంలో, పోలీస్ స్టేషన్ ఆవరణ బయట రోడ్డుపై, మండల కేంద్రంలోని చావిడి వద్ద కొన్ని దకాణాదారుల యాజమానుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసుల ప్రోత్సాహం, దాతల సహకారంతో సీసీ కెమెరాలను బిగించారు. వాటి పర్యవేక్షణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండేది. ఎక్కడ ఏం జరిగినా తెలిసేది. తర్వాత సీసీ కెమారాల నిర్వహణ పట్టించుకోకపోవడంతో అవి పని చేయడం లేదు. అధికారులు సీసీ కెమెరాల పనితీరు పరిశీలించి మరమ్మతులు చేయక పోవడంతో పాడయ్యాయి.

వాస్తవాలు వెలుగులోకి..

మండలకేంద్రానికి ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి–44పై, అంతర్జాతీయ రహదారి కొర్విపాడు స్టేజీ సమీపంలో, చంద్రశేఖర్ నగర్ స్టేజీ సమీపంలో చోరీ, కింది క్యాంపులో చోరీ, మానవపాడు మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో చోరీ పట్టపగలే చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో, గొడవల్లో, బైక్ చోరీలు జరిగితే వెంటనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చు. ఇలాంటి ఘటనలు వెలుగులోకి రాకపోవడం, సీసీ కెమెరాల పనితీరు లేకపోవడంతో గుర్తించలేకపోతున్నామని ప్రజలు పేర్కొన్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం



సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటి పనితీరును నిరంతరం పరిశీలించాలి. అధికారులు పర్యవేక్షణ చేస్తుంటే బాగుంటుంది. సీసీ కెమెరాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశాం, ఇంకా ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అధికారులు పరిశీలించి ఏర్పాటు చేయాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు నియంత్రించగలవు. మండల కేంద్రం ఎప్పుడూ నిఘా నీడలో ఉండాలి.

– ఆత్మలింగారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మానవపాడు

పర్యవేక్షణ చేసి మరిన్ని ఏర్పాటు చేస్తాం

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ పనితీరు సరిగా లేదో గుర్తించి వాటి మరమ్మతులు చేయిస్తాం. ఆయా గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తాం. ఏవైనా సంఘటనలు జరిగితే వాటిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించేలా ఏర్పాట్లు చేసి, నేరాల నియంత్రణకు కృషి చేస్తాం.

– కె. రాము, ఎస్ఐ మానవపాడు